

# వేటూరి సాహితీ ఝరి



తెలుగుచలనచిత్రచరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని సువర్ణాక్షరాలతో లిఖించుకున్న శ్రీ వేటూరి సుందరరామమూర్తి గారు, సినీరంగప్రవేశానికి ముందే ఎన్నో కవితలు, గేయాలు, గేయరూపకాలు, కథలు, వ్యాసాలు, సినీ సమీక్షలు, సీరియల్స్ వ్రాశారన్న విషయం అందరికీ తెలిసి ఉండకపోవచ్చు. ఆ రోజుల్లో వారి కలంపేర్లు కొన్ని - శుభశ్రీ, రామం, సరళ.. వేటూరిగారి సినిమాయేతర సాహిత్యాన్ని పాఠకులకి అందించడమే ఈ శీర్షిక ముఖ్యోద్దేశం. ఈ అంశాలని కౌముదికి అందించిన, పునర్ముద్రణకి అనుమతించిన వేటూరి రవిప్రకాష్(సుందరరామమూర్తిగారి పెద్ద కుమారుడు)గారికి కౌముది ధన్యవాదాలు తెలియచేస్తోంది.

## తెలుగు పాట-

శుభశ్రీ

కనపడనీ వెలుగుబాట
వినపడనీ తెలుగుపాట
గోదావరి, కృష్ణవేణి
తుంగభద్ర, పినాకినీ
పంటలతో నీ వరాల
బంగరుకల పండించగ॥

వచ్చనిపైరులతో అర
విచ్చిన పూదోంతరలో
నిచ్చలు కళ్యాణమ్ముగ
పచ్చతోరణమ్ములుగ॥

చుట్టుకొన్న కొండలనా
కట్టుకొన్న కోటల ని
క్షిద్రమైన నీ చరితా
భద్రగజమ్ములు సాగగ॥

రాయలసీమ, కోస్తా
లోయలు తెలగాణం
భాగ్యనగర వీధిని సౌ
భాగ్యమ్మున పులకించగ॥

స్మృతిలో చిరజీవులైన
గత చరిత్ర కథినాథులు
ధైర్యస్థైర్యమ్ముల నీ
ఆర్యత్వం వెలిగించగ॥

నవయువతారామమ్మున
కవికోకిలపాడనీ

భవితవ్యం లో ఆశా
రవిని ఉదయించనీ॥

1959 నవంబర్ 4, ఆంధ్రపత్రిక దీపావళి సంచికనుంచి

# పెను పండువు...

## వేటూరి సుందరరామమూర్తి

సంక్రాంతి వచ్చె సంసార కాసారక
ల్హార పంక్తికి పూర్ణ శారదవలె
జీవిత మహోకుహూ చింతా తమిస్రాన
సకియ హాసవికాస చంద్రిక వలె
విధుర విరహవ్యధా మధుర సంయోగాన
చిందు నానందాశ్రుబిందువు వలె
లొచ్చు గుండియలనుల్లోలంబు గావించు
పుత్రదీపమయూఖ పుంజమువలె
తరుణ భావుక కవితావతరణమువలె
మంచుకౌగింటిలో చలి మంటవోలె
ప్రణయ వీణా సుఖదానురాగ మధుర
సీధునది యౌచు పండించె జీవితమ్ము-
నాదు జీవిత రామాయణమ్ము లోన
భూమిజాతకు నీడుగా పౌష్యలక్ష్మి
పుడమి పండించి పండి మా ఎడదలోన
పండువుల్ నించె; నిదె పెనుబండువయ్యె.

1961 జనవరి 18, ఆంధ్రపత్రిక సంక్రాంతి సంచికనుంచి

COMMENTS